# గురుదక్షిణ

సరిగ్గా సూర్యుడు నడినెత్తికి వచ్చిన వేళ....!

ఏప్రెల్ ఎండ నిప్పులు చెరుగుతున్న సమయం...

'రాఘవాపురం' అనబడే ఆ ఊళ్లో – 'బస్‌స్టాండ్' అని పిలువడే ఓ మైదానంలోకి అప్పుడే 'ఆర్టీసి' వారి ఎఱ్ఱబస్సు ఒకటి వచ్చి ఆగింది. అందులోంచి నలుగురు ప్రయాణీకులు క్రిందకు దిగేరు... ఆ నలుగురిలో మాధవరావు మాస్టారు కూడా వున్నారు.

ఆయన వయసులో వార్ధక్యం, ముఖంలో అలసట, కళ్ళల్లో దైన్యం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. బస్సు వెళ్లిపోయిన తర్వాత, ఆ మైదానంలోంచి నెమ్మదిగా రోడ్డు మీదకు వచ్చి చుట్టూ పరికించి చూశారు. పరిసరాలన్నీ నిర్మానుష్యంగా వున్నాయి.

ఆ ఊళ్లో సైకిలు రిక్షాలున్నాయి... కానీ, బస్‌స్టాండ్ ఊరి చివర వుండటం వల్లనూ, నాలుగైదు ప్యాసింజర్ బస్సులు తప్ప తక్కినవి అక్కడ ఆగకపోవటం వల్లనూ – 'బేరం' వుంటేనే కానీ రిక్షాలు బస్‌స్టాండు దగ్గరకు రావు.

ఇప్పుడు మాధవరావు మాస్టారు ఇంటికి చేరుకోవాలంటే రెండు కిలోమీటర్ల దూరం నడవాలి... లేదంటే కనీసం ఓ అర కిలోమీటరు దూరమైనా నడచి, ఊళ్లోకి వెళ్లి – అక్కడ రిక్షా ఎక్కాలి.

ఆ ఎఱ్ఱని ఎండలో, అంతటి నీరసంలో–అర కిలోమీటరు కాదు కదా ఆరు అడుగులు కూడా వేయలేని పరిస్థితిలో వున్నారు మాధవరావు మాస్టారు. దానికి తోడు ఆయనకు విపరీతమైన దాహం కూడా వేస్తోంది. సాధారణంగా బస్సొచ్చేవేళకి, అప్పుడప్పుడు ఆ రోడ్డుమీది రావి చెట్టు కిందకి గోలీ సోడా బండివాడు వస్తుంటాడు. ఇవాళ వాడూ కనిపించలేదు.

ఒంట్లో వున్న శక్తినంతా కూడదీసుకుని – గబగబా ఊళ్లోకి నడిచివెడితే – అక్కడ ఓ సోడా తాగి – ఆ తర్వాత నెమ్మదిగా రిక్షాలో ఇంటికి చేరుకోవచ్చునని నిశ్చయించుకున్న మాస్టారు – కుడిచేతిలో వున్న 'సంచీ' ని ఎడం చేతిలోకి మార్చుకుని – పై మీది కండువాతో ఓసారి ముఖం తడుచుకుని నడక ప్రారంభించారు.

నాలుగడుగులు వేశారో లేదో, ఎదురుగా వస్తున్న ఖాళీ రిక్షా కనిపించిందాయనకి. ఆ క్షణాన అది మామూలు 'రిక్షా' లా కాకుండా, తన దీనావస్థకు జాలిపడి ఆ భగవంతుడే పంపించిన పుష్పక విమానంలా తోచింది...

"రిక్షా ఎయ్‌మంటారా బాబూ?" పక్కగా ఆపుతూ అడిగాడు రిక్షావాలా.

"శివాలయం వీధికి వెళ్లాలి. ఎంతిమ్మంటావ్?" అడిగారు మాస్టారు.

"తమరి దయ బాబూ! ఈ ఎండలో అంతదూరం లాక్కెళ్లాల! అంతా మెరక! కట్టం చూసి తమరికి తోచిందివ్వండి!" తల గుడ్డ తీసి దాంతో సీటుతుడుస్తూ చెప్పాడు రిక్షావాలా. అతని నమ్రతాభావం మాస్టారికి నచ్చింది. మామూలుగా శివాలయం వీధికి ఆర్రూపాయలు తీసుకుంటారు...'ఎండగా వుంది కనుక ఇంకో రెండు రూపాయలు ఎక్కువైనా ఇవ్వచ్చు' అనుకుంటూ – రిక్షా ఎక్కి కూర్చున్నారాయన.

అప్పటికి ఆయన ప్రాణం కాస్త కుదుటపడింది.

"రోజూ ఏ మాత్రం సంపాదిస్తావేమిటీ?' మెరక రోడ్డుమీద తొక్కలేక – క్రిందకు దిగి లాక్కెడుతున్న రిక్షావాలాను అడిగారు మాస్టారు.

"అంతా గాలివాటం బాబూ! వస్తే ఓ రోజు యాభై, అరవై వస్తాయ్. లేకపోతే పాతికా, ముప్పయ్ కూడా గిట్టుబాటు కావు!" ఆయాసపడుతూ బదులిచ్చాడు రిక్షావాలా.

"పిల్లలెంతమందీ?" – మరికొన్ని నిమిషాల తర్వాత యధాలాపంగానే అడిగారాయన.

"నాకింకా పిల్లలు లేరు బాబూ! నేనూ, మాయావిడా కలసి అప్పుడే పిల్లలు వద్దనుకున్నాం. కానీ నాకో సెల్లెలుంది. మాయమ్మ సచ్చిపోతూ 'ఒరే నాన్నా! ఇది మనింట మాలచ్మిరా. దిక్కులేనిదానిలా సూడక, సక్కగాసదివించి పెద్ద సెయ్యాలి రా' అంటూ దాన్ని నా సేతుల్లో పెట్టిందండి!'

"మరైతే చదివిస్తున్నావా?"

"సదివిస్తున్నా బాబూ. మా రోజుల్లో అయితే ఇన్ని ఇస్కూళ్లూ, ఇన్ని రకాల సదువులూ వుండేవి కావు. ఇప్పుడు మనూళ్లో అయిస్కూలు కూడా వచ్చింది. పైగా అక్కడ జీతాలూ గట్రా పుచ్చుకోకుండానే పంతుళ్లు సదువులు సెప్తున్నారు. అట్టాంటపుడు, పిల్లల్ని నదివించకుండా ఎట్టావుంటామండీ?. ఇంకో సంగతండి. మా సెల్లెమ్మ బళ్లో సదూకొచ్చి – ఇంట్లో ఆళ్ల వదినె క్కూడా సదువు నేర్పుతాదండి" ఆయాసం మర్చిపోయి ఆనందంగా చెప్పాడతను.

"ఇంతకీ ఏం చదువుతోందీ?" ఆసక్తిని అణచుకోలేక అడిగారు మాధవరావు మాస్టారు.

"ఎనిమిదో క్లాసు బాబూ!"

"గవర్నమెంటు స్కూల్లోనే?"

"అవునండి!"

ఆ స్కూల్లో ఆరో తరగతి నించీ తొమ్మిదో తరగతి దాకా మాధవరావు మాస్టారే లెక్కలు చెప్తుంటారు. కాబట్టి పిల్లందరూ ఆయనకు బాగా తెలుసు. వాళ్లల్లో రిక్షావాలా చెల్లెలు ఎవరో తెలుసుకోవాలన్న ఉత్కంఠ ఆయనలో పెరిగింది.

"నీ చెల్లెలి పేరేమిటి?" అడిగారు.

"గౌరమ్మండి! ఇస్కూల్లో అంతా 'గౌరీ' అని పిలుస్తారంటండి!"

"అలాగా! వెరీగుడ్! గౌరి చాలా తెలివైన పిల్ల. మంచి మార్కులు వస్తూంటాయి. బాగా చదివించు. వృద్ధిలోకి వస్తుంది!" చెప్పారు మేస్టారు.

రిక్షావాలా ఆశ్చర్యపోయాడు.

ఆగిపోయాడు కూడా!

'అది...అంటే నా సెల్లాయి... తమకు తెలుసా బాబూ?" అడిగాడు ఆత్రంగా.

"బాగా తెలుసు. నేను ఆ స్కూల్లో లెక్కల మాస్టర్ని. గౌరి లెక్కల్లో ఎప్పుడూ ఫస్టే! మెరుపు తీగలాంటి పిల్ల! నేను అపుడపుడు అనుకుంటూంటాను 'అది ఏ గొప్పింట్లోనో పుట్టుంటే - తప్పకుండా ఇంజనీరయ్యేదని"

ఆ మాట విన్న రిక్షావాలా గర్వంతో పొంగిపోయాడు. అతని కళ్లు ఆనందంతో తడిసిపోయాయి.

"పర్లేదు బాబూ! దానికి తల్లి లేక పోయినా - నేనున్నాను. ఈ పేదోడి నీడలో పెరుగుతున్న నా బంగారు తల్లికి ఏ లోటూ రానీయను. అది పరీక్షలు పేసవుతుండాలేగానీ ఇంజనీరింగే కాదు - కలకటీరు సదువైనా సెప్పిస్తాను. అందుకోసం అవసరమైతే పాటిమీద నాకున్న పాకా, ఇదిగో ఈ రిచ్చా - ఇయన్నీ అమ్మేసైనా సరే సదివిస్తాను బాబూ.. ఆ తర్వాత గొప్ప సంబంధం చూసి పెళ్లి సేత్తాను!" గర్వంగా అన్నాడు.

అతని మాటలు విన్న మాధవరావు మాస్టారు విస్మయంగా చూశారు.

ఆ క్షణంలో ఆయన కళ్ళముందు - అంతక్రితం రోజు జరిగిన సంఘటన కదిలింది.

మాధవరావు మాస్టారు అంతక్రితం రోజు వరంగల్లు వెళ్లారు. అక్కడ మాస్టారబ్బాయి చలపతి ఉద్యోగం చేసుకుంటున్నాడు. చలపతి తర్వాత ఆయనకు ఓ అమ్మాయి కూడా వుంది. పేరు శకుంతల! ఇపుడామె పెళ్లికి ఎదిగింది. మాస్టారు సంబంధాలు చూస్తున్నారు. చాలా సంబంధాలు కట్నాల దగ్గరే వెనుతిరిగి పోయాయి. ఈ మధ్య నల్గొండ నించి ఓ మంచి సంబంధం వచ్చింది. వాళ్లు 'కట్నం' అడగలేదు. కానీ అబ్బాయికి ఓ కలర్ టీవీ కొని పెట్టమన్నారు. అంటే పాతికవేలకు పైమాటే! ఆ పైన మరో ఇరవై వేలైనా పెళ్లి ఖర్చులవుతాయి. తమ సర్వీసులో అడపా దడపా, పాతికా పరకా చొప్పున దాచిపెట్టిన

డబ్బంతా కలిపితే ఓ పాతిక వేలు దాకా వున్నాయి. ఇంకో ఇరవై వేలుంటే ఆ శుభకార్యం కాస్తా గట్టెక్కి పోతుంది. చలపతి ఉద్యోగం చేసుకుంటున్నాడు కనుక 'చెల్లెలి పెళ్లికి అండగా నిలవకపోతాడా' అనే ఆశతో మాస్టారు అక్కడకు వెళ్లారు. విషయమంతా చెప్పి సహకరించమని అడిగారు. 'ఇరవై వేలు కాదు కదా - ఇరవై వందలు కూడా ఇచ్చుకోలేనని' చెప్పేశాడు చలపతి.

ఇపుడా సంగతి గుర్తుకొచ్చి - చదువుకుని ఉద్యోగం చేసుకుంటున్న తన కొడుక్కీ - చదువురాని ఆ రిక్షావాలాకీ, ఆలోచనల్లో ఎలాంటి అంతరం వుందో అంచనా వేసు కున్నారు మాధవరావు మేస్టారు.

"శివాలయం కాడకొచ్చేశాం! ఎక్కడ దిగుతారు బాబూ?" రిక్షావాలా అడిగిన ప్రశ్నతో ఆలోచనలకు అంతరాయం కలిగి - వాస్తవానికొచ్చేరాయన.

తన ఇల్లు చూపించారు.

అక్కడ రిక్షా దిగి - ముందు ఎనిమిది రూపాయలు ఇవ్వాలకునుకున్న మాస్టారు-అతని పట్ల ఏర్పడ్డ అభిమానం వల్లనో, ఆత్మీయత వల్లనో పది రూపాయలనోటు తీసి చేతిలో పెట్టారు.

"ఉంచు" అన్నారు.

"అమ్మో! వద్దు బాబూ... నా బంగారు తల్లికి సదుపు సెప్పే దేవుడు తమరు. తవరి దగ్గర డబ్బు తీసుకుంటే నా కళ్లు పోతాయ్. పైగా మా గౌరి సదువులో పస్టుంటాదన్న సల్లటి వార్త సెప్పేరు. అదే కోటి రూపాయల ఇలువ నాకు! వుంచండి!" అంటూ ఆ పదినోటును తిరిగి మేస్టారికిచ్చేశాడు. ఆ సమయాన రిక్షావాలా కళ్ళల్లో కన్నీళ్లు మెరవటం గమనించిన మాస్టారు - చెల్లెలి పట్ల అతనికున్న ఆపేక్ష ఎలాంటిదో గ్రహించి పొంగిపోయారు.

'నీలాంటి అన్నకు నా బిడ్డ కూడా చెల్లెలై వుంటే ఎంత బాగుండేదో?' అని మనసులోనే అనుకున్నారు.

ఎంత చెప్పినా మేస్టారి దగ్గర అతను డబ్బులు తీసుకోలేదు.

"డబ్బులు తీసుకోకపోతే మానె ! ఎండనపడి అంతదూరం నించి నన్ను లాక్కొచ్చావ్.. కనీసం కాస్త 'దాహం' తీసుకునైనా వెళ్లు!" అన్నారు.

"పంతుళ్ళంటే సాచ్చాత్తూ దేవుళ్లే కద బాబూ... మీ ఇంటికాడ మంచినీళ్లు తాగినా అవి గుళ్లో తీర్తంలా పవిత్రంగా వుంటాయి - ఇవ్వండి బాబూ!" - అన్నాడు పక్కనే వున్న అరుగుమీద కూర్చుని ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ.

మరి రెండు నిమిషాల్లో మేస్టారమ్మాయి లోపల్నించి గ్లాసుతో మజ్జిగ తెచ్చింది.

"మేస్టారమ్మాయివా తల్లీ?" గ్లాసు అందుకుంటూ అడిగాడు రిక్షావాలా.

అవునని చెప్పిందామె.

"మా సెల్లమ్మ కూడా అచ్చం నీలాగే ఉంటదమ్మా!" - మజ్జిగ తాగిం తర్వాత గ్లాసు ఆమెకిచ్చేస్తూ చెప్పాడు.

ఆ తర్వాత మేస్టారి దగ్గర శలవు తీసుకుని వెళ్లిపోయాడు.

మాధవరావు మాస్టారు బట్టలు మార్చుకుని, వాలుకుర్చీలో కూలబడ్డారు.

"వెళ్ళినపని ఏమైంది?" - ఆతర్వాత కొంత సేపటికి ఆయన భార్య పార్వతమ్మ నెమ్మదిగా అడిగింది.

అక్కడ జరిగిన సంగతంతా ఆమెకు చెప్పారు మేస్టారు.

"మరిప్పుడు ఏం చేద్దాం? ఈ సంబంధానికి కూడా నీళ్లు ఒదులుకోవాల్సిందేనా?" ఆందోళన నిండిన స్వరంతో ప్రశ్నించింది.

"అవసరం లేదు పార్వతీ! ఇపుడు నన్ను తీసుకొచ్చిన రిక్షావాలా నా కర్తవ్యాన్ని నాకు తెలియచేశాడు!" అన్నారాయన దృఢమైన స్వరంతో.

"అంటే...?" అయోమయంగా చూస్తూ అడిగిందామె.

"మూడేళ్లుగా ఉద్యోగం వెలగపెడుతున్న వాడు - ఓ ఇరవైవేలైనా - ఎక్కడో అక్కడ అప్పయినా చేసి, చెల్లెలి పెళ్లికి సాయం చేయలేకపోతాడా అనుకుని కొండంత ఆశతో వెళ్లాను. కానీ వాడికి చెల్లెలి పట్ల ప్రేమా, మన పట్ల బాధ్యతా లేవని అర్థమైంది. అందుకే అక్కడ మరో క్షణం కూడా వుండలేక ఈ ఎండన పడి వచ్చేశాను!"

"మన దురదృష్టం అలా వుంది. చేతికందొచ్చిన చెట్టంత కొడుకు చేయి అందించి అవసరానికి అసరాగా నిలుస్తాడనుకున్నాం..." గాఢంగా నిట్టూర్చిందామె.

"అందుకే నేనో నిర్ణయానికొచ్చాను పార్వతీ!" చెప్పారు మాస్టారు వెంటనే.

"ఏమిటదీ?"

"నా స్వార్జితమైన ఈ ఇల్లు అమ్మేయాలని నిశ్చయించుకున్నాను. ఎంత లేదన్నా ఓ రెండు లక్షలు వస్తుంది. అమ్మాయి పెళ్ళి దర్జాగా చేద్దాం. తక్కిన డబ్బు బ్యాంక్‌లో దాచుకుంటే వడ్డీ వస్తుంది. దాంతో ఎక్కడో అక్కడ మనం అద్దెకుండచ్చు!"

పార్వతమ్మ మౌనంగా వుండి పోయింది.

అలా నాలుగు రోజులు గడచిపోయాయి. ఈ నాలుగు రోజుల్లోనూ తన ఇల్లు అమ్మకానికి పెడుతున్నట్టు నలుగురి చెవినా వేశారు మాస్టారు.

అయిదోరోజు పొద్దున్న తన చెల్లెల్ని వెంటబెట్టుకుని అక్కడకు వచ్చాడు రిక్షావాలా.

"బావున్నావా? ఏమిటి విశేషం. గౌరిని కూడా తీసుకొచ్చేవే?" - ఆత్మీయంగానే పలకరించారు మేస్టారు.

"మా గౌరమ్మ సేత తవరి పాదాలకు దణ్ణం ఎట్టిద్దామని తీసుకొచ్చా బాబూ!" అన్నాడతను వినయంగా.

మాస్టారు కొంచెం ఇబ్బందిగా చూశారు.

"ఇవాళ నా పుట్టిన రోజు మాస్టారూ!..ప్రతీ పుట్టిన రోజునా మా అన్నయ్యే నాకు అక్షింతలు వేసి దీవెనలిస్తుంటాడు. ఇవాళ కూడా అలాగే దీవించమని అక్షింతలు ఇస్తే–'అన్నయ్య దీవెన కంటే దేవుడి దీవెన ఇంకా గొప్పద'ని మీ దగ్గరకు తీసుకొచ్చాడు!" చెప్పింది గౌరి.

"అవును బాబూ! తమరలా కూసోండి. పాదాలకు దణ్ణవెట్టుకుంటాం!" అంటూ కుర్చీని ఆయన పక్కకు లాగి, తన పైమీది గుడ్డతో దాన్ని తుడిచాడు రిక్షావాలా.

వాళ్ళిద్దరి అభిమానానికీ మేస్టారు తల మునకలయ్యేలా తన్మయత్వం పొందేరు.

గౌరికి అక్షింతలు వేసి హృదయపూర్వకంగా ఆశీర్వదించారు.

"నా మూడుపదుల సర్వీసులో ఏ విద్యార్థీ నన్నింతగా గౌరవించలేదు. నీ సద్గుణం, మీ అన్నయ్య సంస్కారం చూసి నేను పొంగి పోతున్నానమ్మా! నువ్ తప్పకుండా గొప్పదాని వవుతావ్. మనస్ఫూర్తిగా అందిస్తున్న నా ఆశీర్వాదం వృథాపోదు!" అన్నారు, ఆమె నదుటి మీద ముద్దు పెట్టుకుని.

ఆ తర్వాత రిక్షావాలా అన్నాడు –

"చెల్లాయికిచ్చిన ఆశీర్వాదంతో పాటు – నాకో మాట కూడా ఇవ్వాలి బాబూగారూ!'

అర్థం కాలేదు ఆయనకి –

"ఏమిటీ?" అడిగారు.

"ముందు మీరు మాటివ్వాలి!"

"అలాగే! ఏమిటో చెప్పు. నీ చెల్లెలికి రోజూ ఇంటిదగ్గర ట్యూషన్ చెప్పమంటావా?" ఉత్సాహంగా అడిగారు మాస్టారు.

"కాదు బాబుగారూ! ఇది మీరు తీసుకోవాలి!" అంటూ ఒక ప్యాకెట్ ఆయనకు అందించాడు.

అర్థం కాక – అది తీసుకుని విప్పి చూశారాయన.

అందులోని నోట్ల కట్టలు చూసి షాకయ్యారు.. అన్నీ వంద రూపాయల నోట్లు.. మొత్తం రెండు కట్టలు... అంటే ఇరవై వేలు!

"ఏమిటిది?" ఆశ్చర్యంగా, అంతకుమించి భయంగా అడిగారు మేస్టారు.

"అమ్మాయిగోరి పెళ్ళికి అవసరం కదా. ఉంచండి బాబూ!" అన్నాడు రిక్షావాలా వినయంగానే.

"నాలుగు రోజుల క్రితం తవర్ని ఇక్కడ దింపి - మజ్జిగ తాగాను కదా బాబూ? అపుడు నా పైమీది తుండుగడ్డ మీ అరుగుమీద పెట్టి మరిసిపోయాను. సగందూరం వెళ్లాక గుర్తొచ్చింది. మళ్లీ ఎంటనే దాని కోసం తిరిగొచ్చాను. అప్పుడు మీరూ, అమ్మగారూ మాట్లాడు కుంటున్నారు. ఆ మాటలన్నీ నా సెవిన పడ్డాయి. పరిస్థితి అర్థం సేసుకున్నాను. నా సెల్లెమ్మకి సదువు సెప్పే దేవుడు కదా తమరు? అందుకే నాకు తోచిన సాయం చేయాలనుకున్నాను" – కృతజ్ఞత నిండిన చూపులతో చెప్పాడు రిక్షావాలా.

"అందుకని... ఇంత.... డబ్బు..." మాటలు పెగిలి రావటం లేదు మేస్టారికి

"ఎంతో లేదు బాబూ... ఇరవై వేలు! చీటీ ఏస్తున్నాను. మీ అవసరానికి అదుకున్నట్టవుద్దనీ – దాన్ని పాడి డబ్బు తెచ్చాను. ఇది కూడా నా సెల్లెమ్మ పెళ్లికోసం కూడబెడుతున్న డబ్బే! ఇంకా రెండేళ్ళ దాకా దాని పెళ్లి ఎట్టాగా సెయ్యను. అప్పటికి మళ్లీ మీరు ఇచ్చేద్దురుగాని. అప్పుగానే తీసుకోండి!" ప్రాధేయపూర్వకంగా చూస్తూ చెప్పాడతను.

మాస్టారు కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యారు. ఆయనకు నోట మాట రావటం లేదు.

ఇంతలో గౌరి చెప్పింది –

"తీసుకోండి మేస్టారూ! ఓ సారి మీరు క్లాసులో చెప్పారుగా, మేమందరం మీకు బిడ్డలతో సమానమనీ. అలాంటపుడు మరి ఈ బిడ్డ మీకు సహాయం చేయకూడదా?"

అమాయకంగా ధ్వనించిన ఆమె మాటలు మాస్టార్ని మూగవాణ్ణి చేసేయి.

ఆనాడు ఏకలవ్యుడు ద్రోణునకిచ్చిన 'గురుదక్షిణ' కంటే – ఇప్పుడు గౌరి వల్ల చేకూరిన సహాయం ఎంతో అమూల్యమైన దనుకున్నారు.

"నువ్విప్పుడు చేసిన ఈ సహాయానికి – నేను జీవితాంతం ఋణపడి వుంటానయ్యా!" అని మాత్రం చెప్పగలిగారు మాధవరావు మాస్టారు. ఆనందా శ్రువులతో నిండిన కళ్లల్లోంచి మసకమసకగా కనిపిస్తున్న రిక్షావాలావైపు చూస్తూ.

ఆ చూపు –

అలనాటి రామదాసు – శ్రీరామచంద్రుని చూసినట్టుగా – ఒకనాటి అన్నమయ్య – శ్రీనివాసుని చూసినట్టుగా తన్మయత్వాన్ని నింపుకుంది!

(ఆంధ్రప్రదేశ్
మార్చి 99)